# చలి కాలం.. నారు మడి పైలం..

- చలి తీవ్రతతో దెబ్బ తినే ప్రమాదం
- మొక్కకు పోషకాలు అందేలా చూడాలి
- రైతులు జాగ్రత్తలు పాటించాలి
- నారుమడి సంరక్షణ చర్యలపై వ్యవసాయ అధికారుల సూచన

దస్తురాబాద్, జనవరి 1 : రైతులు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. నార్లు అలకడం, దుక్కులు దున్నడం వంటి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతుండడంతో వరి నారు ఎదగక పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉంటుంది. చలి తీవత్రపై నుంచి నారుమడులను రక్షించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు 5-15 సెంటిగ్రేడ్, గాలిలో అధిక తేమ శాతం(90-100%) చలి తీవత్ర వల్ల వరి నారుమడులు సరిగా ఎదగక ఎర్రబడి దెబ్బ తినే అవకాశం ఉంది. వరి నారు పసుపు, ఎరుపు రంగులోకి మారే ప్రమాదం ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటునే వరి నారు ఎదగడంతోపాటు అధిక పంట దిగుబడిని సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

**చలి నుంచి కాపాడేందుకు..**

- రాత్రి వేళలో నీరు నిల్వ ఉంచి, ఉదయం ఆ నీరు తీసివేయాలి.
- పగటి పూట వెచ్చని నీరు పెట్టి, సాయంత్రం వేళ నీరు తీసి వేయాలి.
- నారుమడిలో సేంద్రియ ఎరువులు కోళ్లు, గొర్రెల ఎరువు, వర్మికంపోస్టు ఎరువులను 2 గుంటల నారుమడికి 2 క్వింటాళ్లు వేసి కలియదున్నుకోవాలి. దీని వల్ల నారు త్వరగా ఎదుగుతుంది.
- చలి సమస్యలను అధిగమించడానికి ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు, ఇనుప చువ్వలతో ఊతం ఇచ్చి పైన పలుచని పాలిథీన్ షీట్ లేదా కల్లాల పట్టాలతో నారుమడి మీద కప్పి ఉంచి మరుసటి రోజు ఉదయం తీసివేయాలి.
- జింక్ లోపం వలన ఆకులపై ఆకుపచ్చని తుప్పు మచ్చలు ఏర్పాడుతాయి.కాబట్టి జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నారు ఆరోగ్యంగా పెరగడానికి పైపాటుగా యూరియా వేస్తున్నప్పుడు ఒక కిలో యూరియాకి 2 గ్రాముల కార్బెండాజిమ్, మాంకోజెబ్ మిశ్రమ మందును పిచికారీ చేయాలి.
- కాండం తొలుచు పురుగు బారి నుంచి కాపాడుకోవడానికి కార్బోఫురాన్ 3 జీ గుళికలు ఎకరాకు సరిపడే నారుమడికి ఒక కిలో చొప్పున చల్లాలి.
- చలి తీవ్రత ఎక్కువ ఉండి మంచుతో కూడిన వాతావరణం ఉంటే అగ్గి తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా ట్రైసైక్లోజాల్ 0.6 గ్రాములు లీటర్ నీటికి చొప్పున పిచికారీ చేయాలి.
- సూక్ష్మ పోషకాల నివారణకు జింక్ సల్ఫేట్ ఫార్మూలా 4, 5ను పిచికారీ చేసుకోవాలి.

**నారుమడిలో రక్షణ చర్యలు..**



వరి నారు మడి

- నారు పోసిన నాలుగైదు రోజులు తర్వాత నారుమడిలో కిలో యూరియా,2 కిలోల డీఏపీ, కిలో పొటాష్‌ను చల్లాలి. చలి తీవ్రతలో నారుమడి ఎరుపు రంగులోకి మారి దెబ్బతింటుంది. దీని నివారణకు 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నారుమడిలో ఆకుపచ్చ తెగుళ్లు కనిపిస్తే కార్బండిజం 1.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మళ్లీ నాలుగైదు రోజుల వ్యవధిలో నారుమడి ఎరుపు రంగులోనే ఉంటే ఫార్మూలా-4, ఫార్మూలా-5ను రెండు సార్లు పిచికారీ చేయాలి. దీంతో సూక్ష్మ దాతు లోపాన్ని నివారించవచ్చు.
- గడిచిన వానకాలం సీజన్ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ సారి వరిపై కాండం తొలుచు పురుగు ప్రభావం ఉంటుంది. కాబట్టి నారుమడి వేసిన 15 రోజులకోసారి కిలో కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలను చల్లాలి. రెండో విడుతగా నాటువేసే వారం రోజుల ముందు మరోసారి చల్లాలి.

**అధికారుల సలహాలు పాటించాలి**




యాసంగిలో వరి నారుపై చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే నారు ఎదగకపోవడంతో పాటు తెగుళ్లు సోకడంతోపాటు వరి నారు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఎప్పటికప్పుడు నీటిని మారుస్తూ ఉండాలి. వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటించి నారుమడులను కాపాడుకోవాలి.

**- జాడి తిరుపతి, ఏఈవో(దస్తురాబాద్)**

# ఆలయాల్లో 'నూతన' సందడి



నిర్మల్ అర్బన్ : ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నిర్మల్ అర్బన్/ఖానాపూర్, జనవరి 1 : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్మల్‌లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పనులు విజయవంతం కావాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అయ్యప్ప ఆలయంలో ఆలయ దర్మకర్తలు అల్లోల మురళీధర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఖానాపూర్‌లోని పలు ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్య లో తరలివచ్చారు. జంగల్‌హనుమా న్, సాయిబాబా, లక్ష్మీవేంకటేశ్వరాల యం, రామాంజ నేయ ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

# కదిలిలో అయ్యప్ప మహాపడి పూజ



అయ్యప్పకు అభిషేకం చేస్తున్న అర్చకులు, గురుస్వాములు



దిలావర్‌పూర్ : కదిలి మహాపడిపూజ కార్యక్రమానికి హాజరైన భక్తులు

దిలావర్‌పూర్ జనవరి 1 : కదిలి పాపరేశ్వర ఆలయంలో సోమవారం అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరం కావడంతో వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాత అన్నపూర్ణాదేవిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ వెంకట్‌రావు, ఆలయ పండితులు శంకర్, పంచాక్షరీ, సిద్దు పాల్గొన్నారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



భైంసా : మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు




కడెం : బోటులో విహరిస్తున్న పర్యాటకులు

భైంసాస్త్ర/కడెం/దస్తురాబాద్/ఖానాపూర్, జనవరి 1 : ముథోల్ ఎమ్మెల్యే రామారావు పాటిల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కి పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సోమవారం కడెం మండలంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి 12 గంటల అనంతరం పలువురు కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కడెం జలాశయంలో పర్యాటకులు సందడి చేశారు. బోటులో విహరించారు. దస్తురాబాద్ మండలంలో మహిళలు ఇంటి ముందు వాకిట్లో రకాల రకాల ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఆర్ఎస్ నేత భూక్యా జాన్సన్ నాయక్ నివాసంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు.

# రాములోరి అక్షింతల శోభాయాత్ర



కుభీర్ : పార్డి(కే)లో రాములోరి అక్షింతల శోభాయాత్రలో మహిళలు



భైంసాటౌన్ : మహాలింగిలో భజనలు చేస్తున్న గ్రామస్తులు

కుబీర్, జనవరి 1 : మండలంలోని పార్డి(కే) గ్రామంలో సోమవారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాములోరి అక్షింతలను ప్రధాన వీధుల గుండా భజనలు, మహిళల శ్రీరామనామ స్మరణతో శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ అక్షింతలను అందించారు. సర్పంచ్ ఆకుల గంగాధర్, బందెల శంకర్, లంక పోశెట్టి, సత్యనారాయణ, మెంచు మహేశ్, మెట్పెల్లి గజేందర్, శ్రీకాంత్, క్రాంతి, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

**భైంసాలో..**

భైంసా , జనవరి 1 : శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలను సోమవారం శోభాయాత్రగా వెళ్లి ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. కిసాన్ గల్లీ సర్పంచ్ అల్లకొండ సాయినాథ్, ఆర్ఎస్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

**మాటేగాంలో..**

భైంసా టౌన్, జనవరి 1 : మండలంలోని మాటేగాం గ్రామంలో శ్రీరాములోరి అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం కర్ర వినాయకుని ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్‌రావు పాటిల్ పాల్గొన్నారు.

**మహాలింగి గ్రామంలో..**

తానూర్, జనవరి 1 : మండలంలోని మహాలింగి గ్రామంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. భజనలు చేస్తూ శ్రీరాముని అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. వీడీసీ అధ్యక్షులు కృష్ణపటేల్, ఎంపీటీసీ రాకేష్, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**నిర్మల్‌లో..**

నిర్మల్ అర్బన్, జనవరి 1 : శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు సోమవారం నిర్మల్‌కు చేరుకున్నాయి. నటరాజ్‌నగర్ కాలనీలోని ఉమా మహేశ్వర ఆలయంలో అక్షింతలకు పూజలు నిర్వహించారు. ఇంటింటా పంపిణీ చేశారు. కాలనీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఆలయ అధ్యక్షుడు శాంతిలాల్ పటేల్, మంచిర్యాల నాగభూషణ్, అయ్యన్న గారి శ్రీధర్, గన్నేరి ప్రభు, కూన చరణ్, తాటికొండ నారాయణ, ప్రమోద్ తదితరులు ఉన్నారు.

**దస్తురాబాద్‌లో..**

దస్తురాబాద్, డిసెంబర్ 1 : అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను సోమవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఉంచిన అంక్షితలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**గోసంపల్లెలో..**

ఖానాపూర్ రూరల్, జనవరి 1: అయోధ్య నుంచి వచ్చిన రాముని అంక్షితలు గోసంపల్లె గ్రామానికి చేరుకున్నాయి. భక్తులు భక్తి శ్రద్ధలతో అంక్షితలను మంగళహారతులతో హనుమాన్ ఆలయానికి తీసుకెళ్లారు. ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికీ అందజేశారు. కరిపె రాజ్‌కుమార్, మారుతి, బాలక్క, ప్రకాశ్, మహిలు, భక్తులు పాల్గొన్నారు.

**ముథోల్‌లో..**

ముథోల్, జనవరి 1 : ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో హిందు వాహిని ఆధ్వర్యంలో ఇంటింటికీ అక్షింతల పంపిణీ పంపిణీ చేశారు. నాయకులు తాటివార్ రమేశ్, కోరిపోతన్న, దశరథ్, దేవోజీ భూమేష్, ధర్మపురి శ్రీనివాస్, సారథిరాజు, హిందు వాహిని సభ్యులు తదితరులున్నారు.

**కుంటాలలో..**

కుంటాల, జనవరి 1 : మండలంలోని కల్లూర్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా యాత్ర కొనసాగింది. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శౌర్య దినోత్సవం

భైంసా టౌన్, జనవరి 1 : మండలంలోని పెండ్‌పెల్లి గ్రామంలో సోమవారం బీఎస్ఐ ఆధ్వర్యంలో 206వ శౌర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బీఎస్ఐ భైంసా అధ్యక్షుడు ప్రసంజిత్ హెమ్లే మాట్లాడుతూ మహర్ సైనికులు గొప్ప దీరులని కొనియాడారు.

## జిల్లా కార్యదర్శికి సన్మానం

లోకేశ్వరం, జనవరి 1 : నిర్మల్ జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన డా. సాగర్‌ను సోమవారం గంగపుత్రుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాయందర్, ధర్మోరా విద్యా కమిటీ చైర్మన్ అనిల్‌కుమార్ పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

# నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేరుద్దాం



డీఆర్డీవోకు పూలమొక్కను అందిస్తున్న ఉద్యోగులు

నిర్మల్ టౌన్, జనవరి 1 : కొత్త సంవత్సరంలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహించే అనుకున్న లక్ష్యాన్ని నెరవేరుద్దామని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం డీఆర్డీవో ఉద్యోగులు నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని కార్యాలయంలో పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉద్యోగులం దరూ కష్టపడి పని చేద్దామని పేర్కొన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

## అసత్య ఆరోపణలు మానుకోవాలి

ఖానాపూర్ టౌన్, జనవరి 1 : ఖానాపూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం తమపై అసత్య అరోపణలు చేస్తున్నారని ఖానాపూర్, తిమ్మాపూర్‌కు చెందిన వీడీసీ సభ్యులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాము ఏవరిని బెదిరించలేదని, దాడులు చేస్తామని అనకున్న తమ పరువు, ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా సోషల్ మీడియాలో తమపై తీవ్ర అరోపణలు చేసిన సత్యంపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుంట్ల నారాయణ, బీసీ రాజన్న, కరిపె శ్రీను, పుప్పాల మురళి, నేత శ్యాం, అంకం నాగరాజు, మదిరే సత్యనారయణ, మంత్రరాజ్యం దేవేందర్, బొప్పారపు శ్రీనివాస్, కతులపురం గంగనర్సయ్య, నారపాక నర్సయ్య, ద్యావతి రాజేశ్వర్, పరంకుశం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 1: నిర్మల్‌లోని ఏఎన్‌రెడ్డి కాలనీలో గల ఏఎంఆర్ టవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొరిపెల్లి లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాయికృష్ణారెడ్డి, కోశాధికారిగా తోట శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ సభ్యులు అభినందించారు. డా.గోవర్ధన్ రెడ్డి, వీ శ్రీధర్‌రావు, కుంట గంగాధర్ గౌడ్, భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పోతారెడ్డి, స్వామినాథ్ రెడ్డి, సాయిదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.




ఏఎంఆర్ టవర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

# శాలీవాహన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

కుంటాల, జనవరి 1 : శాలీవాహన కుమ్మరి మండల కార్యవర్గాన్ని సోమవారం మండల గౌరవ అధ్యక్షుడు కొత్తపెల్లి బుచ్చన్న అధ్యక్షతన ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కట్టకుంట్ల గంగాధర్, ఉపాధ్యక్షులుగా దామోదర్, లక్ష్మణ్, గౌరవ సలహాదారుడిగా గణేశ్, భోజన్న, కోశాధికారిగా దేవన్న, తదితరులను ఎన్నుకున్నారు.



ఎంపీపీ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

## ఎంపీపీకి ఘన సన్మానం

లోకేశ్వరం, జనవరి 1 : నూతనంగా ఎన్నికైన ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డిని సోమవారం పంచగుడి గ్రామ సర్పంచ్ ఎల్లన్న, ఉప సర్పంచ్ ఇంద్రకరణ్‌గౌడ్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాగర్‌గౌడ్, గంగాధర్, ఎల్లన్న, శ్రీనివాస్, సత్యనారాయణ, పోశెట్టి, ఉదయ్, మహేశ్, శివలింగం, సతీశ్‌రెడ్డి, ప్రవీణ్, నర్సింహులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి సహకరించండి

ఖానాపూర్ టౌన్, జనవరి 1 : ఖానాపూర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయం అభివృద్ధికి సహకారం అందించాలని కోరుతూ పలువురు అయ్యప్ప భక్తులు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును కోరారు. సోమవారం అదిలాబాద్‌లో ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంపీ సానుకులంగా స్పందించి అలయానికి రూ. 20 లక్షల నిధుల మంజూరు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న తెలిపారు. కార్యక్రమంలో సట్ల శంకర్, అర్చకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్ ఢీకొని ఒకరి మృతి

సోన్, జనవరి 1 : నిర్మల్ మండలం రత్నాపూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన పోతరాజు (35) అనే వ్యక్తి ద్విచక్రవాహనం ఢీకొని మృతి చెందినట్లు నిర్మల్ రూరల్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోతరాజు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా నిర్మల్ నుంచి ఖానాపూర్ వైపుకు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో నిర్మల్ ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఢీకొట్టిన వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయినట్లు ఎస్ఐ వివరించారు.

# అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

- గ్యాస్ ప్రమాదాలపై నిర్లక్ష్యం వద్దు : నిపుణుల సూచన



స్టౌవ్

భైంసాటౌన్, జనవరి 1 : ప్రస్తుతం ప్రతీ ఇంట్లో దాదాపుగా వంటగ్యాస్ వినియోస్తున్నారు. వేడి నీళ్లు మొదలుకొని వంటలన్నీ గ్యాస్‌తోనే చేస్తున్నారు. గ్యాస్ వినియోగంలో నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉంటాయి. మంటలు చెలరేగి ఆస్తినష్టం జరుగుతుంది. వంట సిలిండర్ లీకైనప్పుడు ధైర్యంగా రెగ్యులేటర్ ఆఫ్ చేస్తే ప్రమాదం జరుగకుండా నివారించవచ్చు.

**ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

మొదట సిలిండర్ తీసుకునేటప్పుడు పూర్తిగా పరిశీలించాలి. డెలివరీ బాయ్ ముందే సిలిండర్‌ను స్టౌవ్‌కు కనెక్షన్ చేసుకొని చెక్ చేయాలి. వాచర్ బాగుందా. ? లేదా ? తప్పనిసరిగా చూసుకోవాలి. ఒకవేళ వాచర్ బాగోలేకపోతే గ్యాస్ మెల్లగా లీకవుతూ ఉంటుంది. అలాంటప్పుడు వెంటనే వాచర్ మార్చుకోవాలి. వంట పూర్తయిన వెంటనే పొయ్యితో పాటు రెగ్యులేటర్ తప్పకుండా ఆఫ్ చేయాలి. స్టౌవ్‌తో పాటు పైపును జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రతి రెండేళ్లకు ఒక్కసారైనా పైపు మార్చుకోవడం మంచిది. ఎక్కువ రోజులు ఊరు వెళ్లినప్పుడు రెగ్యులేటర్ తీసి సిలిండర్‌కు క్యాప్ పెట్టడం ఉత్తమం.

**గ్యాస్ లీకైనప్పుడు చేయాల్సినవి...**

కొందరు భయంతో తలుపులు, కిటికీలు తొందరగా తెరుస్తుంటారు. కానీ అలా చేయవద్దు. ఒకవేళ తప్పనిసరిగా తీయాల్సివస్తే తలుపులు, కిటికీలు నెమ్మదిగా తీసి ఉంచాలి. గ్యాస్ లీకైనప్పుడు లైట్లు ఎట్టి పరిస్థితుల్లో కూడా వేయవద్దు. దాని వల్ల ప్రమాదం ఎక్కువయ్యే అవకాశం ఉంది. ధైర్యంగా వెళ్లి సిలిండర్ వద్ద రెగ్యులేటర్ ఆఫ్ చేస్తే ప్రమాదం జరగకుండా నివారించవచ్చు. వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వాలి.

**ప్రమాదాలు జరిగే సందర్భాలు..**

గ్యాస్‌లీకై ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. అనేక మంది పొయ్యిపై వంటను పెట్టి బయటకు వెళ్తుంటారు. వండే పదార్థాలు పొంగి గ్యాస్ లీకై ప్రమాదం సంభవించవచ్చు. వంటలు చేసేటప్పుడు నూనె కాగిందో లేదో తెలుసుకోవడానికి నీళ్లు చల్లడం వల్ల ప్రమాదాలు జరుగుతాయి. ఫ్రిడ్జ్ ఇతర ఎలక్ట్రిక్ వస్తువులు వంట గదిలో ఉంచకపోవడం మంచిది. కొన్నిసార్లు షార్ట్ సర్క్యూట్ జరిగి ఆ మంటలు సిలిండర్‌కు వ్యాపించే ప్రమాదం ఉంది.

**సిలిండర్ నుంచి మంటలు వస్తే..**

సిలిండర్ నుంచి మంటలు వస్తే దాదాపుగా అది పేలే అవకాశం ఉండదు. కాకపోతే మంటలు వచ్చినప్పుడు ఆ సిలిండర్ వద్ద ప్లాస్టిక్ వస్తువులు, అదనపు సిలిండర్ ఇతర మండే వస్తువులు ఏవి ఉంచవద్దు. సిలిండర్ నుంచి వచ్చే మంటలు పక్క వస్తువులకు అంటుకుంటే మంటలు పెద్దవి అవుతాయి. అలాంటి సందర్భంలో సిలిండర్ ఉబ్బి పేలే అవకాశం ఉంది. సిలిండర్‌లో మంటలు వస్తే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి.



గ్యాస్ సిలిండర్